# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 15 మే, 2025 | పేజీలు : 08


## వరంగల్, రామప్పలలో మిస్‌వరల్డ్ పోటీదారులు





వివరాలు మెయిన్‌లో...

ప్రభుత్వ పాఠశాలలో..

# కార్పొరేటుకు దీటుగా విద్య

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** విద్యా, వైద్యం ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఇంటర్మీడియట్ అధికారిని మాధవి, సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్, విద్యార్థినీ విద్యార్థులతో మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యా బోధన జరుగుతుందని, కష్టపడి చదువుకుని ఈరోజు ఉన్నత స్థానంలో మంచి ఫలితాలు సాధించి ప్రతిభా పురస్కారాలు అందుకోవడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం విద్యా వైద్యం ప్రధాన అజెండాగా ముందుకు పోతుందని, శాసనసభ్యులుగా గెలుపొందిన 14 నెలల్లో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు పరిశీలించినప్పుడు బాలికలు మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బంది పడే వారిని అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు వసతిని కల్పించామని తెలిపారు. విద్యా శాఖలో సమూల మార్పులు చోటు చేసుకునే విధంగా రామాయంపేట లో 200 కోట్ల రూపాయలతో 20 ఎకరాలలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసుకున్నామన్నారు. విద్య వైద్య రంగాలలో మౌలిక వసతులు కల్పించుకుంటూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వించదగ్గ విషయం అన్నారు ఈ ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం ఇది మీ ఒక్కరికే సన్మానం కాదని మీ కాలేజీల్లో చదువుకున్న ప్రతి ఒక్కరికి సన్మానం లాగా భావించాలని కలెక్టర్ అన్నారు. కళాశాల ప్రిన్సిపల్స్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా పరిధిలోని అభివృద్ధి పనుల్లో..

# వేగవంతం



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు :** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి పరిధిలోని రామచంద్రపురం బారతి నగర్ పటాన్చెరు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ సమీక్షసమావేశంనిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బల్దియా పరిధిలోని చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ,నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తిచేసే ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అదికారులకు సూచించారు. మూడు డివిజన్ల పరిధిలో శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న పనులపై అధికారులు రోజు వారి తనిఖీలు చేపట్టాలన్నారు. నిధులకు సంబందించిన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అభివృద్ధి పనులు నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని తెలిపారు. బల్దియా సర్కిల్ 22 ఈఈ సురేష్, డిఈలు నరేందర్ ,దేవేంధర్, ఏఈలు శివకుమార్, దివ్య ,తేజలు పాల్గొన్నారు.



### ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ముందస్తు అరెస్టు

# సాంప్రదాయాలను దెబ్బతీశారు..

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** సాంప్రదాయాలను దెబ్బతీసే విధంగా జరుగుతున్న అందాల పోటీలను అడ్డుకోవాలని జాతీయ మహిళా సమాఖ్య నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్‌లో ప్రపంచ సు ందరీమణుల పర్యటన నేపథ్యంలో ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు హనుమకొండ జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవిని వంగర పోలీసులు ముందస్తు అరెస్టు చేసారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తెలుగు సాంస్కృతి సంప్రాదాయాలను అవమానపరుస్తూ జరుగుతున్న అందాల పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. మహిళలను అవమానపరిచే విధంగా జరిగే ఇలాంటి పోటీలను ప్రభుత్వం నిర్వహించవద్దని కోరారు.

# యూత్ నాయకులకు ప్రాధాన్యత

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచనా విధానం మేరకు పరకాల నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ నాయకులకు అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జులు పడాల రాహుల, అశ్విన్ రాథోడ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ సూచనలతో పరకాల నియోజకవర్గయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులైన నమిండ్ల మనోజ్‌కు ఎమ్మెల్యే రేవూరి, టీపీసీసీ అబ్జర్వర్ మక్సూద్ అహ్మద్‌తో కలిసి నియామకపత్రాన్ని అందచేసి ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. రాబోయే కాలంలో కాంగ్రెస్‌లో యువతే మంచి పదవులు పొందుతారని యువత పార్టీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా కష్టపడి పనిచేస్తే పార్టీలో బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేస్తూ అర్హులకు అందేలా చూసి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య యూత్ కాంగ్రెస్ నాయకులు వారధిగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్న మంచి పథకాలను చూసి ఓర్వలేక ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను యూత్ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా తిప్పి కొట్టాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జిగా నియమితులైన నమిండ్ల మనోజ్ మాట్లాడుతూ.. నాకు ఇన్‌ఛార్జి రావడానికి సహకరించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జులు పడాల రాహుల్, అశ్విన్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్, పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి



ప్రజాపక్షం/దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్తకాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆలకుంట్ల వెంకన్నసుజాత దంపతుల కుమారుడు సందీప్‌జ్యోతిల వివాహం కొడకండ్ల మండల కేంద్రంలోని శ్రీసీతారామ గార్డెన్స్‌లో జరుగగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్‌గౌడ్, రవి, నాయకులు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్న: (సిపిఎం)



ప్రజాపక్షం/జఫర్‌గడ్: మండలంలోని తమ్మడపల్లి జి గ్రామానికి చెందిన ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా అరెస్టును సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడుతూ అందాల పోటీలను వ్యతిరేకించినందుకు ప్రభుత్వం అక్రమ అరెస్టులను చేసిందని ఆయన ఖండించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజు, మండల కమిటీ సభ్యులు సుధాకర్, నాయకులు ఐలయ్య, రాములు, రాజు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి



ప్రజాపక్షం/జఫర్–గడ్: మండల కేంద్రంలోని వడ్డగూడెం గ్రామానికి చెందిన గంధం చంద్రమౌళిని భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు చెవుల యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షునికి, జిల్లా అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.

## 26,27 తేదీలలో సిపిఐ జిల్లా మహాసభలు



ప్రజాపక్షం /ఎల్కతుర్తి : హసన్ పర్తి లో ఈనెల 26, 27 తేదీలలో జరిగే సిపిఐ హనుమకొండ జిల్లా మహాసభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు కోరారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద పోస్టర్‌ను సిపిఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూపేద ప్రజల కొరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిన పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని భూ పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐ పార్టీదే అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో భూ పోరాటాలు నిర్వహించి, పది లక్షల భూమిని పంచిన చరిత్ర సిపిఐదని అన్నారు. అదే విధంగా ఈనెల 18న ఎల్కతుర్తి మండల మహాసభ జరుగుతుందని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కామెర వెంకటరమణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, మండల కార్యవర్గ సభ్యులు తండా మొండయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్ ,గడ్డం రాజనర్సు, ఇంజాల పోశయ్య, పిన్ రెడ్డి మోహన్ రెడ్డి ,ఆరేపల్లి చంద్రమౌళి, సుర మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పట్టాలను రద్దు చేయాలి



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న పట్టాలను రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల డిప్యూటీ తహశీల్దారు కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991 లో ప్రభుత్వం.హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి మండల పరిధిలోని, దండేపల్లి గ్రామానికి చెందిన భూమిని, 289 మంది దళిత కుటుంబాలకు ప్రభుత్వం కేటాయించింది.ఇట్టి భూమిని గుంటూరుపల్లె గ్రామానికి చెందిన కమ్మ సామాజిక వర్గం వాళ్లు, అక్రమంగా 63 ఎకరాల 15 గుంటల భూమిని కేవలం 33 మంది పేరున ధరణిలో పట్టాలు, పాసుపుస్తకాలు పొంది.ఆ భూమి నుండి దళితులను బలవంతంగా వెళ్లగొట్టి వారి ఆధీనంలో ఉంచుకున్నారని,కావున ఈ ప్రభుత్వం కేటాయించిన భూమిని ఉన్నత సామాజిక వర్గాలకు చెందిన వారు, ధరణిలో అక్రమంగా పట్టా చేసుకున్న వారిపైన చట్టరీత్యా చర్య తీసుకుంటూ,అక్రమ ధరణి పట్టాలను రద్దు చేస్తూ దళితులకు సొంత భూమి హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి శనిగరపు రాజుకుమార్, గడ్డం రాజనర్సు, ఆరేపల్లి చంద్రమౌళి, తండ మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వవద్దు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హన్మకొండ జిల్లాలో హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, ధర్మసాగర్ మండలాలో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర ఫౌండేషన్ కు ఇచ్చే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో హనుమకొండ డిఈవో ఆఫీసు ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగింది. అధికారుల మొండి వైఖరి నశించాలని, భోజన కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, సిఐటియు జిందాబాద్, భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించోద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు, ముట్టడి కార్యక్రమాన్ని తెలుసుకున్న సుబేదారి సిఐ సత్యనారాయణ రెడ్డి పోలీసులతో వచ్చి ధర్నా విరమించాలని పదేపదే సిఐటియు నాయకులను హెచ్చరించారు. సమస్యను పరిష్కరించాలని జాయింట్ మీటింగ్ ను ఏర్పాటు చేయాలని పోలీసులతో చర్చలు చేయడం జరిగింది. అనంతరం గురువారం డీఈవో తో చర్చలు జరుగుతాయని ఫోన్లో మాట్లాడి తెలుపగా ముట్టడిని విరమించారు. ఈ కార్యక్రమానికి నిడిగొండ రజిత అధ్యక్షత వహించగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, హన్మకొండ జిల్లా సిఐటియు కార్యదర్శి రాగుల రమేష్‌లు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి మధ్యాహ్న భోజన పథకాన్ని మహిళా పొదుపు సంఘాల సభ్యుల నుండి ఎన్నికైన నిర్వాహకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ నిర్వహిస్తున్నారని, వీరికి ప్రభుత్వం పని భద్రత కల్పించి కనీస వేతనాలు ఇవ్వాల్సింది పోయి పథకాన్ని ఇప్పుడు స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పి కార్మికుల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ పథకం స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. విద్యార్థులకు విద్యతో పాటుగా పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం అక్షయపాత్ర వంటి ఫౌండేషన్స్ కు ఇవ్వటం ద్వారా పర్యవేక్షణ నాణ్యత లోపాలతో పలు రాష్ట్రాలలో ఇప్పటికే విమర్శల పాలు అయిందన్నారు. హనుమకొండ జిల్లాలో అంగన్వాడి కేంద్రాలకు సప్లై చేసే ఆహారంలో కూడా సరిగా నాణ్యత లేదని పిల్లలు తల్లిదండ్రుల ద్వారా ఇప్పటికే ఆ సంస్థ విమర్శలు ఎదుర్కొంటుందని తెలిపారు. హన్మకొండ జిల్లాలో డీఈవో వాసంతి గారు వెంటనే కార్మికులకు మరియు విద్యార్థులకు నష్టం చేకూర్చే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని పథక నిర్వాహకులకు భరోసా కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో కె.సక్కుబాయి,పి.సమ్మక్క,పర్వీన్,పి. పద్మ,సంధ్య,లక్ష్మి ,రాధిక, విజయ,వసుంధర,రాణి,తస్లీమ్, షమీం,సరిత,కళ శైలజ నిర్మల,భద్ర,సుభద్ర భాగ్యలత,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఈ నెల 20న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని స్థానిక కొంరయ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు జనరల్ సెక్రటరీ మంద నర్సింగరావు, ఏఐటియూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఐఎన్‌టియుసి బ్రాంచి ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్ రెడ్డి, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్యలు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ 100 సంవత్సరాలుగా సాధించుకున్న 44 లేబర్ కోడ్ లను నాలుగు చట్టాలుగా మార్చి కార్మిక హక్కులను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతుందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం కార్మిక సంఘ జేఏసీ నాయకులు సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాత రాజు సతీష్, సిఐటియుసి నాయకులు కంపేటి రాజయ్య, టీబీజీకేఎస్ నాయకులు నల్లబెల్లి సదానందం, కుమార్, మల్లారెడ్డి, సురేష్, అశోక్ ఐఎఫ్టియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాపక్షం/గణపురం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుసంధానంతో వీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్స్ బుర్ర సాగర్,కే రామకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పొదుపు మరియు దాని ఆవశ్యకతను బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ మరియు డిజిటల్ ఫ్రాడ్స్ సైబర్ క్రైమ్స్ పై క్షుణ్ణంగా వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ లు కలిగి ఉండాలన్నారు. ఆ డబ్బులు సంవత్సరానికి ఒకసారి కట్ అవుతున్నాయో చూసుకోవాలన్నారు. ముందుగా ఎవరు నామిని ఉన్నారో బ్యాంక్ వెళ్లి చూసుకోవాలన్నారు. అంతే కాక సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతాయో సెల్ ఫోన్ ద్వారా ఇష్టం ఉన్న మెసేజ్ లు క్లిక్ చేస్తే ఎంత నష్టం జరుగుతుందో వివరించారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయి

ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలోనే ఇందిరమ్మ రాజ్యం పేద ప్రజల కలలు సహకారమవుతాయని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని గార్లగడ్డ తండా గ్రామంలో మార్చి 16న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఇందిరమ్మ ఇళ్ల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద ప్రజల సొంతింటి కల సాకారమవుతుందన్నారు. నియోజకవర్గంలో మండలానికి ఒక గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు అందులో భాగంగా చిల్పూరు మండలంలో ప్రత్యేక ప్రేమతో గార్లగడ్డ తండా గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. అందుకే గ్రామంలోని అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ రైతు భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించాలని, ఇప్పటికే పనులు ప్రారంభించిన లబ్ధిదారులకు రూ. ఒక లక్ష జమయ్యాయన్నారు. లబ్ధిదారుల ఇంటి నిర్మాణాన్ని 600 అడుగులు మించకుండా కట్టుకోవాలని సూచించారు. అప్పుడే బిల్లులు తొందరగా వస్తాయని, 600 అడుగుల పైన నిర్మాణం చేస్తే బిల్లు రాక ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. గార్లగడ్డతండాకు మల్లన్న గండి ఎత్తిపోతల నుండి వచ్చే నీటి ద్వారా కాలువలతో రెండు పంటలకు సాగు నీరు అందుతుందన్నారు. పనిచేసే వారిని ఎన్నుకుంటే అభివృద్ధి జరుగుతుందని, తాగి తినే వారిని ఎన్నుకుంటే 15 ఏళ్లలో ఏం అభివృద్ధి జరిగిందో మీరే చూశారన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ, తహసీల్దారు, ఎంపీడీఓ, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# 31న జిఓ 3 పునరుద్ధరణ కోసం ఐటిడిఎ ముట్టడి

## గొండ్వాన సంక్షేమ పరిషత్ నిరుద్యోగులకు పిలుపు



ప్రజాపక్షం/వెంకటాపూర్: ఆంధ్రప్రదేశ్‌లో జీవో నెంబర్ 3పై పునరుద్ధరణ అంశమై వెంకటాపురం కేంద్రంలో బుధవారం గొండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా పూనెం ప్రతాప్ దొర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2000 సంవత్సరంలో షెడ్యూల్ ఏరియాలో స్థానిక రిజర్వేషన్ జీవో నెంబర్ 3 రిజర్వేషన్ కోట ద్వారా ఆదిమ జాతుల నిరుద్యోగులకు 60 వేల ఉద్యోగాలు 29 శాఖలలో భర్తీ అయినాయి. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో ఆదిమ జాతుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని మరియు షెడ్యూల్ ఏరియా రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకొని ఆదివాసి నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం జరిగిందని అన్నారు. రాష్ట్రాల పునర్విభజనలో భాగంగా షెడ్యూల్ ఏరియా ప్రాంతాన్ని చిన్నాభిన్నంగా గురిచేసి, ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయానికి గురిచేశారు. అని అన్నారు, ఆంధ్ర ప్రభుత్వం జీవో నెంబర్ 3 ని పునరుద్ధరణ కోసం ఆంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించి గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ప్రత్యేక చొరవ తీసుకొని చర్చించి పూర్తి న్యాయం చేకూరుస్తానని ఒక ప్రకటన ద్వారా ఆదివాసి నిరుద్యోగులకు భరోసా కల్పించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు కూడా తెలంగాణ ప్రాంత షెడ్యూల్ ఏరియా ఆదివాసి నిరుద్యోగులకు ఆంధ్ర ముఖ్యమంత్రి తరహాలో ప్రత్యేక దృష్టి సారించి తెలంగాణ ఆదివాసి నిరుద్యోగులకు జీవో నెంబర్ 3 కొరకు తెలంగాణ ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని కొరకు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ రిక్రూట్మెంట్ జరిగేది ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాల కాలంలో ఆదివాసి ఉద్యోగ కల్పన ఏర్పాటు విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం గురిచేసిందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వంలో ఉన్న ఆదివాసి ఎమ్మెల్యేలు తో ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటు,చేసి జీవో నెంబర్ 3 పై అసెంబ్లీలో తీర్మానం చేసి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలని, తద్వారా చట్ట రూపం కల్పించి ఏజెన్సీ డీఎస్సీ ఏర్పాటులో శ్రద్ధ వహించాలని లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికలలో ఆదివాసి ఎమ్మెల్యేలు గూడేలాలకు ఓటు కోసం వస్తే ఆదివాసి నిరుద్యోగులు తిరుగుబాటు చేస్తారని అన్నారు. అలాగే మే 31 వ తారీఖున జరిగే భద్రాచలం ఐటిడిఏ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసులు పర్శిక బాబు రావు, పూనెం విజయ్, సభక రాజు, కృష్ణార్జునరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# మానవహక్కుల మార్గదర్శి బుర్ర రాములు

## ఖిలా వరంగల్ లో జరిగిన బుర్ర రాములు 14వ యాది సభ



ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : మానవ హక్కుల నేత డాక్టర్ బుర్ర రాములు 14వ యాది సభ సంఘం జిల్లా జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు అధ్యక్షతన ఖిలా వరంగల్ పడమరకోట చమన్ సెంటర్ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఇది ప్రజా సంఘాల నాయకులు ఘనంగా జరిపారు. ముందుగా రాములు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బాదావత్ రాజు తదితరులు మాట్లాడారు. బుర్ర రాములు విద్యార్థి దశ నుండే సామాజిక అవగాహనతో ప్రగతి శీల ఉద్యమాలను నిర్మించారని వారు అన్నారు. వివిధ వర్గాల ప్రజలు ప్రజల హక్కులు ప్రభుత్వాలు పెత్తందారులు భూస్వాములు హరించే సమయంలో అండగా ఉండి పోరాడారని వారు తెలిపారు. 1980 నుండి రెండు దశాబ్దాల చీకటి కాలంలో నాటి ప్రభుత్వాలు పౌర ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తుంటే అమరులు డాక్టర్ బాలగోపాల్ నర్రా ప్రభాకర్ రెడ్డి ల తో కలిసి పీడిత ప్రజల పక్షాన నిలబడ్డారన్నారు. నేడు దేశ ప్రజలు హిందూ ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారని అంటూదళిత మైనారిటీ జాతుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలలో డాక్టర్ బుర్ర రాములు స్ఫూర్తిగా తీసుకొని పనిచేయడమే ఆయనకు మనం అందించగల నివాళి అని వారు అన్నారు. మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు హరికృష్ణ నాయకులు పాలకుర్తి సత్యనారాయణ, సాదు రాజేష్, శ్రీనివాస్, యాదగిరి, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ అడ్వకేట్ తీగల జీవన్ మైదం సంజీవ, బి.ఐలయ్య, మైదంపాని హరిబాబు లతోపాటు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్ని విధాల అభివృద్ధి చేస్తా



ప్రజాపక్షం/జనగామప్రతినిధి: చిల్పూర్ మండల కేంద్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం చిల్పూర్ మండల కేంద్రంలోని కొత్తపల్లిలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి కడియం ముఖ్య అతిథిగా హాజరవగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. సీసీ రోడ్డు ప్రారంభోత్సవ అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి రానన్ని అభివృద్ధి నిధులు స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గానికి తీసుకువచ్చానన్నారు. కొత్తగా ఏర్పాటైన చిల్పూర్ మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మల్లన్నగండి ఎత్తిపోతల పనులను పూర్తిచేసి వచ్చే జులై వరకు రెండు పంటలకు సాగునీరు అందిస్తానని వెల్లడించారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదం, ఆశీస్సులు ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రంలో జరిగిన పలు వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. అదేవిధంగా పలువురు ఇటీవల అనారోగ్యానికి గురవడంతో వారిని పరామర్శించారు. బుధవారం మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన కళ్లెం రాణిపరుశరాములు కుమారుడు రవి కిరణ్‌సౌమ్య వివాహం బృందావన్ గార్డెన్‌లో జరిగింది. అదేవిధంగా నునావత్ పరమేష్‌మానస వివాహం, పెద్దవంగర మండలం కాన్వాయ్‌గూడెం గ్రామానికి చెందిన పనికెర కొమురయ్య యాదవ్ కుమారుని వివాహం దశరథ గార్డెన్స్‌లో జరిగింది. నూతన వధువరులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశీర్వదించారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన కిష్టయ్య అనారోగ్యంతో ఉండడంతో వారి కుటుంబ సభ్యులను ఎర్రబెల్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్, నాయకులు పుస్కూరి శ్రీనివాసరావు, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డి, ఎల్లయ్య, కుమార్, దయాకర్, కరుణాకర్‌రెడ్డి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : జిల్లాలో ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాలలో పనిచేస్తున్న హమాలీలకు తాడుకట్టు మాములు ఒక లారీకి 2000 రూపాయలు ఇవ్వాలని, రైతుల నుండి కాకుండా ప్రభుత్వమే నేరుగా ఒక బస్తాకు రూ 70 కూలీ ఇవ్వాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్వోకు అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షులు సంగాల మొగిలి, జిల్లా ఉపాధ్యక్షులు పుల్ల అశోక్, సంఘం జిల్లా నాయకులు కొంగంటి సదానందం, బేరపాక కేశవయ్య, సాంబయ్య, ఎం భాస్కర్, బి నాగరాజ్, ఎం శంకర్, పోషాలు,కేభద్రయ్య, ఎం రమేష్, ఎస్ అశోక్, ఎం రాజయ్య, మామిడి స్వామి, రవి, జగన్, శ్రీనివాస్, కంటాత్మకూర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కుష్టు నివారణపై అవగాహన ఉండాలి

ప్రజాపక్షం/భీమదేవరపల్లి: జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపల్లి, భీమదేవరపల్లి, వంగర గ్రామాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా స్థాయి నిపుణుల బృందం గ్రామాలను సందర్శించి, ప్రజలకు కుష్టువ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఆశా కార్యకర్తలు ఏప్రిల్ నెలలో లెప్రసీ సర్వేలో చేసి గుర్తించిన అనుమానితులకు వైద్య పరీక్షలు చేసారు. ఎర్రటి, తెల్లటి, స్పర్శలేని మచ్చలు ఉన్నవారికి అవసరమైన వైద్యం అందించారు. జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, వంగర వైద్యులు డా.రహమాన్, డా.రుబీనా, డా.రాజశేఖర్, సూపర్‌వైజర్లు మోహన్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య నిలయం ఏర్పాటు అభినందనీయం

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి : ప్రజల సౌకర్యార్థం ఆయుర్వేద వైద్య నిలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కారల్ మార్క్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి పూజిత ఆయుష్ ఆయుర్వేద నిలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పూర్వీకులు పేస్టు, ద్రవాలు కాకుండా వేప పుల్లలు, కానుగు పుల్లలు, బర్రెంక పుల్లలతో దంతాలు తోముకునేవారని తెలిపారు. దీని ద్వారా ఎలాంటి వ్యాధులు రాకుండా ఎక్కువ కాలం జీవించే వారని గుర్తు చేశారు. ప్రకృతి పర ప్రధ మైన ఆయుర్వేద వైద్యం ద్వారా సర్వ రోగాలు మటుమాయం అవుతాయన్నారు. ప్రజల సద్వినియోగ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి పూజిత ఆయుష్ ఆయుర్వేద నిలయం డీలర్లు వావిలాల జనార్ధన్, బండెల భూమయ్య, మై లైఫ్ స్టైల్ నేషనల్ టీం కోఆర్డినేటర్ జి.రాజ్ కుమార్, రీజినల్ టీం కోఆర్డినేటర్ మహేష్, స్టేట్ టీం కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి, టీం కోఆర్డినేటర్ రాజిరెడ్డి, ఏరియా సేల్ డీలర్ శ్రవణ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, స్వామి, శిరప అనిల్, కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, నాయకులు డాక్టర్ రమేష్, కిశోర్ రెడ్డి, ఉడత మహేందర్, తదితరులు ఉన్నారు.

# రసాయనాల వినియోగం తగ్గించాలి

## మల్లారెడ్డిపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** వ్యవసాయంలో యూరియాను ప్రతి పంటకు శాస్త్రయంగా నిర్ణయించిన మోతాదు లోను వేసుకోవాలని మోతాదుకు మించి అధికంగా యూరియా వేయడంవలన పంటకు నష్టంతో పాటు పర్యావరణం భూమికి హాని కలుగుతుందని వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ జి. సంతోష్ కుమార్ అన్నారు. హసన్ పర్తి మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో యూరియాను ప్రతి పంటకు శాస్త్రీయంగా నిర్ణయించిన మోతాదు వేసుకోవాలని మోతాదుకు మించి అధికంగా వాడడం వలన పంటకు నష్టంతో పాటు పర్యావరణం భూమికి హానికలుగుతుందని తెలియజేశారు రైతులకు సాగు ఖర్చులు పెరగడం పంట నష్టాలు ఎక్కువగా ఉంటాయని సాయం పంట నష్టాలు ఎక్కువగా ఉంటాయని వ్యవసాయంలో నీటిని సమర్ధవంతంగా ఎలా వాడుకోవాలని అంశాల పైన అవగాహన కల్పించారు వ్యవసాయంలో అధిక రసాయనాలు వినియోగం తగ్గించాలని అన్నారు. డాక్టర్ సి. సౌజన్య మాట్లాడుతూ వ్యవసాయంలో పంటల మార్పిడి పద్ధతులను అనుసరించడం వేప కషాయాలను వినియోగించడం వలన రైతులు ఎరువులను, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని జాగ్రత్తగా దాచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ రసీదులను పంట నష్టం వచ్చినప్పుడు భీమ పొందేటప్పుడు ఈ రసీదులు ఉపయోగపడతాయని అన్నారు నాణ్యతలేని విత్తనాలు ఎరువులు పురుగు మందులను కొనుగోలు చేయరాదని సాగులో రసాయన వినియోగం వినియోగం తగ్గించుకోవాలని కోరారు పర్యావరణం లో చెట్ల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. చెట్లను నరికివేయడం వంటివి తగ్గించాలని పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి అనూష మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు గుర్తింపు కార్డులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కార్యక్రమంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు భూమి పట్టా పాస్ బుక్కు ఆధార్ కార్డు లింక్ ఉన్న ఫోన్ నెంబర్లు రైతు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని ప్రతి రైతుల సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. జి .సంతోష్ కుమార్ , యస్ సౌజన్య ,వ్యవసాయ విస్తరణాధికారి అనూష వ్యవసాయ కళాశాల విద్యార్థులు మల్లేష్, శాలిని పాల్గొన్నారు.

## అభయాంజనేయ ఆలయ అభివృద్ధికి విరాళం

**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం రిటైర్డ్ టీచర్ పిల్లల నారాయణ భార్య కీ.శే. వీరలక్ష్మి రూ. 1,01,116 ఆలయ నిర్వాహకులు గ్రామస్థులు సమక్షంలో విరాళంగా అందజేశారు. ఈ ఆలయంలో మే 19న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరగనుంది. విరాళం అందజేసిన పిల్లల నారాయణను ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు, రిటైర్ టీచర్ నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలం లోని జీడికల్ గ్రామం లోని గల, జై శ్రీమన్నారాయణ శ్రీ వీరాచల జీడి కంటి శ్రీరామచంద్రస్వామి, దేవాలయంలో, బుధవారం, ఉదయం, అర్చకులచేపూర్వకాలం నాటి, చండ ప్రచండ (ద్వార పాలకులను) పున: ప్రతిష్ఠ, కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో, జనగామ ఉప్పలమ్మ (అమ్మ బావి) దేవస్థానం ఆలయ అధికారి, కేకే రాములు, దేవస్థాన చైర్మన్, మూర్తి, డైరెక్టర్, ఉడుగుల, వెంకన్న, దేవస్థాన జూనియర్ అసిస్టెంట్, కే భరత్, మల్లేశం, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని తొలగించాలి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరిని తొలగించాలని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పందు కనకయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఒంటెద్దు పోకడలతో ప్రతిపక్షాలకు తొత్తులుగా వ్యవహరిస్తూ కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తూ పార్టీకి తీవ్ర నష్టం చేకూరుస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కూడా అర్హులకు కాకుండా తనకు నచ్చిన వారికి ఇచ్చుకుంటూ పార్టీకి, కార్యకర్తలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడని వెంటనే ఆయనను మండల పార్టీ అధ్యక్షుని పదవి నుండి తొలగించాలని లేదంటే పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని ఏకపక్షంతో తీర్మానం చేసి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి, కార్యకర్తల సంతకాలతో కూడిన లేఖను పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దామెర థామస్, అర్జుల సుధాకర్‌రెడ్డి, చిలువేరు సంపత్, రాజు, నరసింహులు, చంద్రయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నారదా మూర్తిని స్మరించుకున్న భక్తులు

**ప్రజాపక్షం/నెక్కొండ:** కొన్ని వేల సంవత్సరాల క్రితం దేవతలకు మానవులకు సంధానకర్తగా తన తుంబుర నాదం ద్వారా పద్య రూపముగా, పాటల రూపంగా వివరించే మహోన్నతమైన వ్యక్తి నారద మహర్షి తను ఏ పని చేసినా లోక కళ్యాణం కోసం చేసేవారని పురాణ ఇతిహాసాల ద్వారా మనకు తెలుసు, అలాంటి మహోన్నతమైన నారద మహర్షి జయంతి బుధవారం ఆయన భక్తులు వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. తహసిల్దార్ వేముల రాజుకుమార్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏపిఎం శ్రీనివాస్, ఏపీఓ జాకబ్, మండల విద్యా అధికారిని రత్నమాల, పలువురు మాట్లాడుతూ, నాటి నారద మహర్షి పాత్రను ప్రస్తుతం పత్రికా విలేఖరులు పోషిస్తున్నారని, ప్రజలకు ప్రభుత్వాలకు అధికారులకు సంధానకర్తలుగా వ్యవహరిస్తూ, పలువర్గాల ప్రజలు నారద మహర్షి వారసులుగా పత్రిక విలేకరులను పోల్చినారు.

## రైతన్న విధానంలో మార్పు లేకపాయే..

**ప్రజాపక్షం/నెక్కొండ:** రైతులు వారి పంట పొలాల్లో పత్తి మొక్కజొన్న తదితర పంట వ్యర్ధాలను నేరుగా పంట చేలల్లోనే కాల్చకూడదని అలా చేసిన యెడల భూసారంలో కొన్ని విలువైనవి పంటలకు అవసరమైన క్రిమి కీటకాలు చనిపోతాయని తద్వారా పంట దిగుబడి తగ్గుతుందని ఎన్నో రైతు అవగాహన సదస్సులో ప్రతి రైతుకు చెప్పిన వినిపించు కోవడంలేదని వరంగల్ జిల్లా నెక్కొండ మండల వ్యవసాయ అధికారి ఏ నాగరాజు మండలంలోని పనికర లో జరిగిన రైతు అవగాహన సదస్సులో ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా మండలంలో యదేచ్ఛగా రైతులు సాయంత్రం వేళలో పంట చేలలో పత్తి చెట్లను తగల పెడుతున్నారని ఆయన అన్నారు. ఈ విధానం సరైనది కాదని అలా చేస్తే పంట దిగుబడి తగ్గుతుందని, పంటలకు కొత్త రకాల వైరస్లు సోకినప్పుడు, విత్తనాలు సరైనవి కాదు అంటూ, అధికారులు పట్టించుకోవడం లేదంటూ, ఆరోపణలు చేస్తారు. ఇది సరైన విధానం కాదన్నారు. మారుతున్న పరిస్థితుల దృశ్య రైతు వ్యవసాయ అధికారుల సూచనలు మేరకే వ్యవసాయం కొనసాగించాలని, ఇప్పటికైనా రైతులు పత్తి, మొక్కజొన్న, తదితరులను భూమిలోనే కలిసిపోయేలా చూడాలని,అలా చేస్తే సారవంతంగా భూమికి బలం చేకూరు తుందన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించండి




**ప్రజాపక్షం/మహాదేవపూర్:** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల మండల బాధ్యులు కుమ్మరి రాజు పిలుపు నిచ్చారు.కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మండలంలోని ఎడపల్లి గ్రామంలో బుధవారం వాల్ పోస్టర్ విడుదల చేసారు.ఈ సందర్భంగా కుమ్మరి రాజు మాట్లాడుతూ ఈ నెల 20 న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా సంపూర్ణ మద్దతు తెలిపిందని అన్నారు.సంఘటిత,అసంఘటిత కార్మికులు,ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు,ఉద్యోగులందరూ భారీ స్థాయిలో తరలి వచ్చి విజయవంతం చేయాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విదానాలు,మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తుందని దాన్ని తిప్పికొట్టాలని అన్నారు. కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తెలిసి వచ్చేలా సమ్మెను విజయవంతం చేయాలని అన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తు కార్పోరేట్ శక్తులకు వంతపాడుతుందని నాలుగు లేబర్ కోడ్లలను తిప్పికొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు విశిష్ట కార్డు

**ప్రజాపక్షం/నెక్కొండ:** రాబోయే రోజుల్లో ప్రతి రైతుకు విశిష్ట కార్డు రైతులకు ముఖ్యమని వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర లో రైతు విశిష్ట కార్డుల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి నాగరాజు అన్నారు. రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి కిసాన్ యోజన తో పాటు ఎరువులు, విత్తనాలు, కొనుగోలు కేంద్రాల్లో పంటలు అమ్ముకున్న రోజున ఈ 11 అంకెలతో ప్రభుత్వం జారీ చేయనున్న విశిష్టత కార్డు ప్రభుత్వం తప్పనిసరి అనే విధానాన్ని కల్పించ నున్నదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నూతన విధానాన్ని రైతుల కోసం ప్రవేశపెట్టిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రైతు విశిష్టత రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఆయన అన్నారు, కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి వసంత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మూరితోనే అభివృద్ధి


**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండల అభివృద్ధి కొమ్మూరితోనే సాధ్యమని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీనివాసగార్డెన్‌లో కాంగ్రెస్ మండల కార్యకర్తల ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం మండల ప్రధాన కార్యదర్శి అల్వాల ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది.సీనియర్ నాయకులు మాట్లాడారు.

## కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం డైరెక్టర్ దుర్గయ్యకు సన్మానం



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం డైరెక్టరవ గా ఎన్నికైన మాజీ ఎంపిటీసీ మంచినీళ్ల దుర్గయ్యను మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాబు బుధవారం దేవస్థానం ఆవరణలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించినట్లు మంచినీళ్ల దుర్గయ్య తెలిపారు.ఈ సందర్భంగా మంచినీళ్ల దుర్గయ్య,లేతకరి రాజబాబు మాట్లాడుతూ పార్టీకి విధేయతతో పని చేసిన తనకు ప్రముఖ దేవస్థానానికి డైరెక్టర్ గా నియమించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, యువ నేత శ్రీనుబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.దళితులకు కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక స్థానం ఉంటుందని నిరూపించారని అన్నారు.విధేయతతో పార్టీకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ గుర్తిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిపారు.

## హింసించినా..ధర్మాన్ని వీడని ఉక్కుమనిషి



**ప్రజాపక్షం/నెక్కొండ:** 40 రోజులు హిందూ ధర్మాన్ని విడాలంటూ చిత్రహింసలు పెట్టిన ఔరంగజేబు హింసలు భరించారే తప్ప తన ధర్మాన్ని వీడని మహోన్నతమైన త్యాగశీలి ఛత్రపతి శంబాజీ మహరాజ్ నేటి భారతీయులకు స్ఫూర్తి అని ఆయన జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో బుధవారం నివాళులు అర్పించి కీర్తించారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్న కాంగ్రెస్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి:** కాం గ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ పూజలహరికృష్ణ అన్నారు. బుధవారం సిద్దిపేట కోటిలింగేశ్వరస్వామి ఆలయం నూతన డైరెక్టర్ల చే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా నియోజక వర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలసి మాట్లాడారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో మంచి పేరు వస్తుంటే ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బిజెపిలకు మింగుడు పడటం లేదన్నారు. కాంగ్రెస్ అక్కసు పెంచుకొని కాంగ్రెస్ సర్కార్, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను విమర్శించటమే పనిగా పెట్టుకున్నారన్నారు. బిజెపి నేత, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ లేని పోని వ్యాఖ్యలు చేస్తూ తన స్థాయిని మించి మాట్లాడుతున్నారన్నారు. ఈటెల రాజేందర్ దివాళా కోరు రాజకీయాలు మానుకోవాలన్నారు. మతం పేరిట బిజెపి రాజకీయం చేస్తుందన్నారు. దేశ ప్రజలనుమోసం చేసేలా వ్యహరిస్తుందన్నారు. దేశం కోసం. ధర్మం కోసం అంటు కల్లబొల్లి మాటలు చెబుతుందన్నారు. మరోసారి కాంగ్రెస్ నేతలు జగ్గారెడ్డి, రేవంత్ రెడ్డి,మంత్రులను విమర్శిస్తే సహించేది లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రా ష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్ర పూరిత రాజకీయాలను ప్రజలు గమిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కోటిలింగేశ్వర నూతన డైరెక్టర్లు ఆలయ అభివృద్ధి కోసం కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు గంప మహేందర్‌రావు, అత్తుఇమామ్,దేవులపల్లి యాదగిరి,మార్క సతీష్, రజని, సలీం, సాయిప్రతాప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## అంధకారంలో సీతానగర్ పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** పాపన్నపేట మండల పరిధిలోని సీతా నగర్ గ్రామంలో చీటికిమాటికి కరెంట్ పోతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా తమ గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వారన్నారు. మంగళవారం సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు విద్యుత్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వారు ఆరోపించారు. ఏఅధికారికి ఫోన్ చేసిన కనీసం స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా నిత్యం కరెంట్ సమస్య ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. గ్రామంలోవిద్యుత్ అంతరాయం కలిగిన పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/పాపన్నపేట:** స్నేహితుని కుటుంబానికి తమ వంతు సహాయంగా చిన్ననాటి మిత్రులు ఆర్థిక సహాయం చేసి దాతృత్వం చాటుకున్నారు. మండల పరిధిలోని పోడ్చన్ పల్లి తాండాకు ందిన బాల్య ఇటీవల గుండెపోటుకు గురై మరణించారు. 1991 పదవ తరగతి బ్యాచ్ సంబంధించిన చిన్ననాటి మిత్రులు అందరు కలిసి బుధవారం 44 వేల రూపాయలను బాల్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, సుదర్శనం, సిద్ధిరాం రెడ్డి, లక్ష్మారెడ్డి,రఘువీర్, రవీందర్, గోపాల్, రాజు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొడ్చిన్‌పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొడిచన్పల్లికి చెందిన నర్ధన కిష్టయ్య (40)కు భార్య లక్ష్మి, కూతురు గంగమణి, కొడుకు బీరప్ప ఉన్నారు. వ్యవసాయం పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి వచ్చి, ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారి లేచి చూసే సరికి చనిపోయి ఉన్నాడు. కుటుంబీకు ఫిర్యాదు మేరకు పాపన్నపేట ప్రొబెషనరి ఎస్సై నరేష్ కేసు నమోదు చేసుకొని, పోస్ట్ మార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్



**ప్రజాపక్షం/గణపురం:** ములుగు జిల్లా పస్రా గ్రామంలో కొండ్రెడి చెన్నారెడ్డి గార్డెన్స్ లో గణపురం మాజీ ఉపసర్పంచ్ పోతర్ల అశోక్ యాదవ్ అన్న పోతర్ల రవీందర్ యాదవ్ కుమారుని వివాహ వేడుకకు హాజరై నూతన వధువరులు కిరణ్ యాదవ్ భవాని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు గాజర్ల చింటూ గౌడ్, మార్క సాయి గౌడ్, ఎండి వాజిత్,హాఫీజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డి నుండి నగదు ప్రోత్సాహం



**ప్రజాపక్షం/కౌడిపల్లి:** మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామానికి చెందిన బొడ్డు యాదగిరి, యామిని దంపతుల కుమారుడు రోహన్ హైదరాబాద్ షాపూర్ నగర్ లోని సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్లో పదవ తరగతి (సీబీఎస్ఈ) లో మెరుగైన ఫలితం సాధించడంతో బుధవారం మాజీ మంత్రి మల్లారెడ్డి రూ 5000 నగదు ప్రోత్సాహం అందజేసి ప్రోత్సహించారు. పదవ తరగతి సీబీఎస్ఈ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో రోహన్ 500 మార్కులకు గాను 434 మార్కులు సాధించాడు. దీంతో బుధవారం మాజీ మంత్రి మల్లారెడ్డి విద్యార్థిని అభినందించి ప్రోత్సాహం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీక్ష రైజాదా, అడ్మిన్ ఇన్చార్జి లక్ష్మణ్, డైరెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

## దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** వరస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అదుపులోకి జిల్లా పోలీసు అదుపులోకి తీసుకుని సుమారు 29 తులాల బంగారం, 47 తులాల వెండి, నగదు రూ.4లక్షలు స్ప్లెండర్ బైక్, స్వాదీనం చేసుకున్నారు. సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య గౌడ్ ప్రెస్‌మీట్‌లో ఇచ్చిన సమాచారం ప్రకారం జిల్లా వ్యాప్తంగా పగలు,రాత్రి దొంగతనాలు, నివారించాలనే ఉద్దేశ్యంతో జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ఆదేశాను సారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తుండగా బుదవారం నాడు ఉదయం సుమారు 6 గంటల సమయంలో సంగారెడ్డి బైపాస్ రోడ్డు వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ఒక ఆటో నెంబర్ ఏపి 23 టీఏ 0092 గల దానిలో నలుగురు వ్యక్తులు 1.మార్ల యాదగిరి తండ్రి అడివయ్య,వయస్సు 44 2.మైనర్ బాలుడు వయస్సు 1718, 3. మార్ల అనిత భర్త యాదగిరి వయస్సు 42, 4 తలారి లక్ష్మి భర్త భూమయ్య, వయస్సు 34 సంవత్సాలు నిందితులు అనుమనాస్పందంగా వెల్లుతుండగా ఆటోను ఆపి క్రమంలో నలుగురు వ్యక్తులు ఆటో దిగి పారిపోతుంటే వారిని పోలీసు వారు వెంబడించి పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కేసు చేధనలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి రూరల్ సిఐ క్రాంతి కుమార్, ఎస్ఐ రవీందర్ క్రైమ్ సిబ్బంది షాకీర్, నాగరాజు, నర్సింలు, డిఎస్పీ అభినందించారు.

## ఘనంగా మహంకాళమ్మ కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో బుధవారం మున్నూరు కాపు కులస్తుల ఆరాధ్య దైవమైనటువంటి మహంకాళమ్మ మొదటి వార్షికోత్సవంలో భాగంగా మూడవరోజు ధ్వజ శిఖర ప్రతిష్ట కార్యక్రమం తో పాటు శ్రీ మహంకాళమ్మ కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారని అన్నారు. అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. సాయంకాల సమయంలో శ్రీ మహంకాళమ్మకు బోనాలను సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు లక్ష్మీనారాయణ,ఆకుల తిరుమల్,ఆకులసత్తయ్య, భాజకిష్టయ్య, బాజ రమేష్, బాజ రవీందర్, ఆకుల మహేందర్, మహిపాల్, కుమార్,రాజు,ఆకుల ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి 25వేల ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుడు మహమ్మద్ ముస్తఫా (28) ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ముస్తఫా, కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 25 వేల రూపాయలను అందజేస్తామని హామీ ఇచ్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్లు బాపురెడ్డి, బాజాచంద్రం, అందె కొండల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి బాల్రెడ్డి, భాస్కరరావు, నాగరాజు, సంగుస్వామి, ఆకుల మహేష్, మావురంరాజు, గోపరి నర్సింలు, పున్న వెంకటస్వామి రాములు గౌడ్, శ్రీకాంత్ సాగర్, నారా గౌడ్, నగేష్, రాము, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నిజాంపేట్:** రైతులు రైతు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఆయన మాట్లాడుతూ, రైతులు కేంద్ర ప్రభుత్వం పథకాలను పొందడానికి ఈ రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దీని ద్వారా 11 అంకెల ఐడి నంబర్ తోకార్డు రావడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

**ప్రజాపక్షం/టేకుమట్ల:** త్వరలో జరగనున్న స్థానిక జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని, ప్రజల్లో మంచితనం ఉన్నవారికే అవకాశాలు ఉంటాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ధ్ధవారం మండలం కేంద్రంలో ఓ ప్రైవేటు స్థలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ అధ్యక్షతన మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మాసంపెల్లి లింగాజి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుండి పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ అన్నారని గుర్తు చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

**సిఎం సహాయ నిధి అండగా నిలుస్తోంది**

పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. బుధవారం ధ్ధవారం సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 20 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.11,50,500 విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఆపదలో సీఎం సహాయనిధి ఆపద్బాంధులా ఆదుకుంటుందని తెలిపారు. మానవతా దృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రామకృష్ణాపూర్ (టీ) నుండి ధ్ండి అంబేద్కర్ సెంటర్ వరకు జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం రామకృష్ణాపూర్ (టీ) నుండి ధ్ండి అంబేద్కర్ సెంటర్ వరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో అతిథులు పాల్గొన్నారు. అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడాబాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఇటు అన్ని కార్యక్రమాలలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పులి తిరుపతిరెడ్డి,పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పులిమామిడి రాజు వివాహ వార్షికోత్సవ వేడుక



**ప్రజాపక్షం/ సదాశివపేట:** సదాశివపేట పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో తన పెళ్లి రోజును పురస్కరించుకొని తన కుటుంబ సభ్యులతో ,పి.ఎం.ఆర్ యువసేన నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు మమత దంపతులు తమ వివాహ వార్షికోత్సవ సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి పి.ఎం.ఆర్ యువసేన ఆధ్వర్యంలో ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పి.ఎం.ఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇరువురి దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పులి మామిడి దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రతి ఒక్క పి.ఎం,ఆర్ అభిమానికి నాయకులకు పులి మామిడి రాజు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తనయుడు పులిమామిడి మనోజ్ , కుమార్తె మాదవి, యువసేన నాయకులు రాగం అనిల్ ,ఆనంద్ గుణాకర్ జిజ్జు ,అఖిల్ ,నర్సింలు, గోల్డ్ స్మిత్ బగిలి, విష్ణు, షకీల్ తాలెల్మ రాము, చీలం సురేష్ ,బామిని రవి, కుమార్, హరీష్, బంటు ,రవి, చాపల హనుమంతు ,పిట్టల రమేష్, తిర్మల్, శ్రీనివాస్, పొట్టి పల్లి వెంకట్, సోమశంకర్, నరేష్, మొదలగు వారు పాల్గొన్నారు.

# 13వ హజ్రత్‌రిజ్వాన్ చిస్తే ( ర.ఆ) ఉర్సు ఉత్సవాలు



**ప్రజాపక్షం/హత్నూర:** హత్నూర మండలం కాసాల గ్రామ శివారులో గల ప్రముఖ ప్రసిద్ధి గాంచిన హజ్రత్ సుఫీ అజీజుద్దీన్ రిజ్వాన్ సయ్యద్ ఫాష్ ఖాద్రి కాలందరి అహ్మద్ నాయబి అల్ మిర్జాయి (ర.అ) దర్గా ఉర్సు ఉత్సవాల ఈనెల 18,19 తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వహకులు యూసుప్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఈ నెల 18 తేది ఆదివారం నందల్ ముబారక్ (గంధం) ఊరేగింపు 19వ తేది సోమవారం చిరాగా (దీపారాదన) కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక ,హైదరాబాద్, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల జిల్లాల నుండి వివిధ గ్రామాల నుండి భక్తులు హాజరై ఈ దర్గా దర్శనం చేసుకుంటారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో అన్న దాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తులకు ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్య రాజకీయ నాయకులు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

# మైనార్టీ గురుకుల పాఠశాల ఆడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరణ

## కలెక్టర్ క్రాంతి వల్లూరు




**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** మైనార్టీ గురుకుల ఆడ్మిషన్ల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బుదవారం నాడు ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్జీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆడ్మిషన్లకు సంబందించిన ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని , మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్ఎల్‌సి బహుమతి జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# కోమటిచెరువులో హనమాన్ భక్తుల తెప్పోత్సవం



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేటలో నల్లురు, విజయవాడలో ఇద్దరు స్వాములతో మొదలైన హనుమాన్ దీక్ష మాలధారణ.నేడు ఎల్లలు దాటి విశ్వవ్యాప్తంగా అయిదంటే హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ అకంటిత దీక్షయే కారణమని రామరాజు రావిచెట్టు హనుమాన్ చారిట్రబుల్ ట్రస్టు అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. గత 16 సంవత్సరాలుగా రామరాజు రావిచెట్టు హనుమాన్ హనుమాన్ స్వాములను అన్నప్రసాదం (బిక్ష) సిద్దిపేటలో ప్రారంభమైందన్నారు. అలాగే విజయవాడలో నిర్వహించే తెప్పోత్సవం సిద్దిపేటలో మాత్రమే నిర్వహిస్తామన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రామరాజు రావిచెట్టు హనుమాన్ చారిట్రబుల్ ట్రస్టు సభ్యులు మాట్లాడారు. ఈనెల 15న గురువారం సాయంత్రం ఐదుగంటలకు సిద్దిపేట కోమటిచెరువులో హనుమాన్ తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయం నుండి శోభాయాత్రగా బయలుదేరి కోమటిచెరువు వద్ద తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తెప్పోత్సవంలో కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, హనుమాన్ భక్తులు హిందూ బంధువుల పెద్దఎత్తున పాల్గొని విజయవంతం కోరారు. ఈ మీడియా సమావేశంలో ఆలయ అర్చకులువైద్య కృష్ణమాచార్యులు, ట్రస్టు సభ్యులు నేతి కైలాసం, గ్యాదరి పరమేశ్వర్, నందిని శ్రీనివాస్, కుమ్మరి కుంట రమేశ్, తిప్పరాజు మధుసూదన్, చింత శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి: తహసీల్దార్ దత్తారెడ్డి



**ప్రజాపక్షం/రేగోడు:** రేగోడు మండలంలో ని ధాన్యం కొనుగోలు కేంద్రం ఐకెపి తాసిల్దార్ దత్తారెడ్డి పరిశీలించిరు బుధవారం రేగోడు ధాన్యం కొనుగోలు కేంద్రంన్ని పరిశీలించిరు ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు ఉన్నందువలన ఎప్పటికప్పుడు ధాన్యం తరలించే ఏర్పాటు చేయాలని సూచించారు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు ఐకెపి ద్వారా ధాన్యం కొనుగోలు మండలంలో జోరుగా జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది లక్ష్మ ణ్ ఐకెపి సిసి అనసూయ అనిత తదితరులు ఉన్నారు.

# పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి:** సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు వివాహా వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట విజేందర్ రెడ్డి, కంది మండల పార్టీ మధుసూదన్‌రెడ్డి, పట్టణ అద్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు చేర్యాల ప్రభాకర్ ,మనోహర్ గౌడ్, మల్లేశం, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయానికి గ్రనేట్‌ను విరాళంగా అందచేసిన మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట మండలం లింగరెడ్డి పల్లి వనదుర్గమాత ఆలయంకు గ్రానైట్‌ను మాజీ మంత్రి హరీష్‌రావు విరాళంగా అందచేశారు. పట్టణంలోని 1వ వార్డు లింగారెడ్డిపల్లిలో నిర్మిస్తున్న వనదుర్గ ఆలయానికి మీ వంతూ సహాయం అందించాలని ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్తులు మాజీ మంత్రి హరీష్‌రావును కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మాజీ మంత్రి హరీష్ రావు ఆలయ నిర్మాణానికి అవసరమగు గ్రైనేట్ సుమారు ఆరులక్షల రూపాయలు విలువ చేసే గ్రానైట్‌ను అందించారు. దీంతో ఆలయ నిర్మాణం కోసం గ్రానైట్‌ను అందించిన మాజీ మంత్రి హరీష్ రావుకు ఆలయ కమిటి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్వయం సహాయక సంఘాల స్టాళ్లు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రంలో కొనసాగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పవిత్ర సరస్వతి పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో స్వయం సహాయక సంఘాల స్టాళ్లు, హ్యాండ్లూమ్ మరియు టెక్స్‌టైల్ ఉత్పత్తుల స్టాళ్లు పెద్ద ఎత్తున సందర్శకులను ఆకట్టుకునేలా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఏర్పాటు చేశారు.స్టాళ్ళ పర్యవేక్షణకు డిఆర్డీఓ నరేష్, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు తమ కృషిని ప్రతిబింబించేలా నాణ్యమైన హస్తకళా ఉత్పత్తులు, సేంద్రీయ ఆహార పదార్థాలు, పచ్చడులు ఇతర గ్రామీణ ఉత్పత్తులను విక్రయాలు చేయనున్నారు. స్థానికంగా తయారైన ఈ ఉత్పత్తులు పుష్కర సందర్శకుల నుండి విశేష ఆదరణ లభించనుంది. అలాగే టెక్స్‌టైల్ మరియు హ్యాండ్లూమ్ స్టాళ్లలో పట్టు చీరలు,నూలు వస్త్రాలు, డిజైన్ దుస్తులు,చేనేత వస్త్రలతో కూడిన ప్రత్యేక కలెక్షన్ ప్రదర్శించబడుతోందని పర్యవేక్షణ అధికారులు తెలిపారు. ఈ ప్రాంత హస్తకళల పరంపరను ప్రతిబింబిస్తూ పుష్కర సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తునున్నాయి. ప్రత్యేక ఆకర్షణగా మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు తక్కువ ధరల్లో, నేరుగా ఉత్పాదకుల నుంచి వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్టాళ్లు ఏర్పాటు ద్వారా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలపడేందుకు ఇలాంటి అవకాశాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

## భూమాత శాంతికి బూరెలు



**ప్రజాపక్షం /చందుర్తి:** శాస్త్ర సాంకేంతిక జ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న ప్రజలు తమలో ఉన్న మూఢ విశ్వాసాలను మాత్రం నేటికి విడువలేక పోతున్నారు .మండలం లో ఇటీవల కొద్ది క్షణాల పాటు భూమి కంపించింది.దీనితో భూతల్లికి ఆకలి వేసి కంపించిందని,బూరెలు వండి పెడితే భూతల్లి ఆకలి తీరుతుందని పుకారు చెక్కర్లు కొట్టడంతో ప్రజలు బూరెలు వండి ఇండ్లలోని కూరాడు కుండల వద్ద ఉంచి శాంతించమని వేడుకొని భూమి లో పాతి పెడుతున్నారు.సాధారణంగా భూమి లోపలి పొరల్లో కదలికల వల్ల భూమి కంపిస్తుందని తెలిసిన వారు చెప్పినా వినకుండా ఈ విధంగా చేస్తూ ఉండడం తో ప్రజల విశ్వాసాలకు వమ్ము చేయకూడదని చదువుకున్న వారు సైతం మిన్నకుంటున్నారు.ఏది ఏమైనా ప్రజలు మూఢనమ్మకాలను , మూఢ విశ్వాసాలను విడనడాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

## బీరప్ప కల్యాణ మహోత్సవాల్లో



## పాల్గొన్న ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం నమిలి గుండుపల్లి, బాలరాజ్ పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న శ్రీబీరప్పకామరతి స్వామివార్ల కల్యాణ మహోత్సవంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలరాజు

# పెన్షన్ దారులకు పెన్షన్లు పెంచాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి పెన్షన్ దారులకు పెన్షన్ను పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఎం ప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ అన్నారు. సమాచార హక్కు చట్టం2005 మార్గ దర్శనం అనుసరించి సింగరేణి వ్యాప్తంగా కనీస పెన్షన్ రూ.1000 తీసుకునేవారు ఎంత మంది? మొత్తం పెన్షనర్లు ఎంత మంది? పెన్షన్ ఆగిపోయిన వారు ఎంతమంది?ఉన్నారని గోదావరి ఖని, కొత్త గూడెం ప్రాంతీయ కమిషనర్ల కు లేఖ వ్రాయగా ఈ క్రింది సమాచారం ఇచ్చినారని తెలిపారు.సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం1998 ప్రకారం పెన్షన్ చెల్లింస్తున్నారు. ఇట్టి పెన్షన్ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ప్రధాన కార్యాలయం ఝూర్ఖండ్ రాష్ట్రంలోని ధన్ బాద్ పట్టణంలో ప్రధాన కార్యాలయం కలదు.తెలంగాణా లో గోదావరిఖని, కొత్తగూడెంలో ప్రాం తీయ కమిషనర్ల పరిధిలో 31,32,015 వరకు గోదావరి ఖని ప్రాంతీయ కమిషనర్ పరిధిలో 6215 మందికి, కొత్త గూడెం ప్రాంతీయ కమిషనర్ పరిధిలో 2134 మొత్తం 8349 మందికి కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారు. సింగరేణి వ్యాప్తం గా గోదావరిఖని ప్రాంతీయ కమిషనర్ కార్యాలయం నుంచి 64276 మందికి, కొత్తగూడెం రీజియన్ లో 18111 మొత్తం 82387 మంది పెన్షన్ పొందుతున్నారు. ప్రతి నెల గోదావరిఖని రీజినల్ కమిష నర్ పరిధిలో రూ.59,85,58,736 కోట్లు, కొత్తగూడెం రీజినల్ కమిషనర్ పరిధిలో రూ.20,06, 15,726 కోట్లు మొత్తం రూ.79,91,74,462 చెల్లిస్తున్నారు.లైఫ్ సర్టిఫికెట్ సమర్పించంకపోవడంతో గోదావరి ఖని కమిషనర్ పరిధిలో3240 మందికి కొత్తగూడెం పరిధి లో 1818 మందికి మొత్తం 5058 పెన్షన్ ఆగిపోయింది. అతి తక్కువ పెన్షన్ పొందు తున్న వారు పెన్షన్ పెరగక చాలా అవస్థలు పడుతున్నారు.కావున యూనియన్ నాయకులు వారిని ఆదుకోవాలి.

# వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గతం కంటే ఎన్నో రెట్లు వేగవంతంగా రైతుల పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు జరుగుతుందని, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ మే 13 నాటికి 2022–23లో 11వేల 26 మంది రైతుల నుంచి 88 వేల 930 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 11 శాతం చెల్లింపులు, 2023 –24లో28 వేల 427 మంది రైతుల నుంచి 2 లక్షల 11 వేల 449 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 72 శాతం చెల్లిం పులు చేయగా ప్రస్తుత సంవత్సరం 29 వేల 206 మంది రైతుల నుంచి 2 లక్షల 18 వేల 392 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి 82% చెల్లిం పులు పూర్తి చేశామని అన్నారు.మే 13 నాటికి గతం కంటే ఎన్నో రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యంలో రైతులకు వడ్ల డబ్బులు సకాలంలో చెల్లిస్తు న్నామని తెలిపారు.భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు పట్ల రైతులు అనవసర ఆందోళనలకు గురి చేయవద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం సేకరించి మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సమ్మర్‌క్యాంపు విద్యతోపాటు ఆటల పోటీలు

**ప్రజాపక్షం/ముత్తారం :** సమ్మర్ క్యాంపు విద్యార్థులకు ఆటపాటలతోపాటు విజ్ఞానం పెంచుకునేలా పలు అంశాలపై చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. యోగా, మెడిటేషన్ చేయిస్తూ వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను మండల విద్యాధికారి హరిప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆటల పోటీల్లో పోటీతత్వం అలవడేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.అలాగే స్థానికంగా సేకరించిన మట్టి, కాగితాలతో బొమ్మసమ్మర్ స్పెషల్ లను తయారు చేయించి వారిలో దాగి ఉన్న కళాత్మక నైపుణ్యాన్ని వెలికితీయడం జరుగుతుందన్నారు. వీటితోపాటు పాఠశాల



ఆవరణలో చిన్నారుల చేత మొక్కలు నాటించి వాటి ఆలనపాలన ఎలా చూడాలో శిక్షణ ఇస్తున్నారు. తద్వారా ఇంటి పరిసరాల్లో ఖాళీ స్థలాలను ఎలా సద్వినియోగం చేసుకో వాలో అవగాహన కల్పిస్తున్నారు.

# మహిళా సంఘాల ద్వారా వృద్ధాశ్రమం నిర్వహణ

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్దపల్లి జిల్లాలో వృద్ధాశ్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరెట్ లో వృద్ధాశ్రమం నిర్వహణ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ మహిళా సంఘాలు పొదుపు తదితర విషయాలే కాకుండా సామాజిక సేవకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమైన విషయమని జిల్లా కలెక్టర్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం 70 లక్షల రూపాయల ఖర్చుతో వృద్ధాశ్రమాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. వృద్ధాశ్రమంలో నిరాదరణ లో ఉన్న 50 వయోవృద్ధులు మందికి ఆశ్రయం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ ఆశ్రమాన్ని నిర్వహించటానికి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు కోరగా అర్హతగల సంస్థలు ఏవీ రాకపోవడంతో జిల్లా మహిళా సమాఖ్య వారికి ఈ బాధ్యతను అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు.వృద్ధాశ్రమాన్ని నిర్వహించడమే కాకుండా సంవత్సరానికి సుమారు ఆరు లక్షలు వృద్ధుల కోసం మహిళా సంఘం ఖర్చు చేయడానికి ముందుకు రావడం వారి సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుందని కలెక్టర్ అన్నారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వహణ విషయమై జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాలరావు తో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్నేహ




కార్యదర్శి శోభ ,కోశాధికారి స్వప్న అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా యువ వికాసం అర్హుల జాబితా ఎంపిక

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాజీవ్ యువ వికాసం కోసం పథకం క్రింద అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రాజీవ్ యువ వికాసం, నీటి పారుదల శాఖ కాల్వల రిన్నోవేషన్‌పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం క్రిందస్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అర్హులైన దరఖాస్తుల వివరాలను బ్యాంకర్లు వెంటనే సంబంధిత ఎంపీడీఓ లకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకర్లు అందించిన జాబితాను ఎంపిడిఓ పరిశీలించి గత ఐదు సంవత్సరాలలో కార్పొరేషన్ ద్వారా ఇతర రుణాలు, యూనిట్ల ఏమైనా పొందు ఉన్నారా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉందో పరిశీలించి తుది అర్హుల జాబితాను పారదర్శకంగా ఎంపిక చేసి ఎమ్మెల్యేలకు త్వరితగతిన రిపోర్ట్ అందించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోనీ వివిధ సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న కాల్వల రిన్నోవేషన్, కాల్వలలో ఉన్న పిచ్చి మొక్కలు,చెత్త తొలగింపు, అక్కడక్కడ మరమ్మత్తు పను లను గుర్తించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పీ సీఈఓ నరేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పుస్తె మట్టెలు వితరణ



**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గౌరీ శంకర్ లక్ష్మి కూతురు వివాహం ఉందని తెలపగా, చిట్నేని మాధవి వెంకటేశ్వర్ రావు నూతన వధువుకు పుస్తె మట్టెలు పంపించారు. బుధవారం విద్యాసాగర్ రావు చేతుల మీదుగా వారికి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏంఎంసి వైస్ చైర్మన్ కొమ్మటి రాజమల్లు, గౌరీ సురేష్ పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య..

### - ఫీట్స్‌వ్యాదే కారణమా!!



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఫీట్స్ వ్యాధితో గత కొంత కాలంగా భాదపడుతూ ఎల్లారెడ్డిపేట గొల్లపల్లి గ్రామానికి చెందిన ముద్రకోల అంజలి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముద్రకోల శంకర్ కు ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.చిన్న కుమార్తె అంజలికి పలుమార్లు మూర్చ వ్యాధితో భాదపడుతుందని అన్నారు.తల్లితండ్రులు మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రుల చుట్టు తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో నిరుపేద కుటుంబానికి చెందిన అంజలి తీవ్ర మనస్థాపం చెంది ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.తన తల్లితండ్రులకు ఇబ్బందులు తలెత్తకూడదని బుధవారం ఉదయం గదిలోకి వెల్లిన అంజలి ఎంతసేపటికి రాకపోవడంతో తన సోదరుడు మల్లికార్జున్ చూసే సరికి విగతజీవిగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండతంతో బోరున విలపించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకుని పోస్టుమార్టం కోసం సిరిసిల్లా ఆసుపత్రికి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల పిర్యాదు మేరకు కేసు నమోదు అయినట్లు ప్రొబేషనరీ ఎస్సై లక్ష్మ ణ్ మీడియా ప్రకటనలో తెలిపారు.